ప్రజాశక్తి
ఆదివారం 9 నవంబర్ 2025
5
అనంతపురం



11న సివిల్‌సప్లయ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభలు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

అనంతపురం జిల్లాలో ఈనెల 11న సివిల్ సప్లయ్ వర్కర్స్ యూనియన్ మహాసభలను నిర్వహిస్తున్నట్లు సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి ఓబులు తెలిపారు. కామ్రేడ్ నాగరాజు అధ్యక్షతన జిల్లా సివిల్ సప్లై వర్కర్స్ యూనియన్ సమావేశం పుట్టపర్తిలో శనివారం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఓబులు మాట్లాడుతూ ఈనెల 11న అనంతపురం జిల్లాలో 11న సివిల్ సప్లయ్ వర్కర్స్ యూనియన్ మహాసభలను నిర్వహిస్తున్నట్లు వివరించారు. అనంతపురం జిల్లాలో జరుగుతున్న రాష్ట్ర మహాసభ కు ప్రతి పాయింట్ నుంచి ఇద్దరు చొప్పున హాజరుకావాలని ఆయన కోరారు. మనుషులు మారుతున్నారే తప్ప ప్రభుత్వాల విధానాలు మారలేదని అన్నారు. నిరంతరం ప్రజలకు ఆహార ధాన్యాలు సరఫరా చేసే కార్మికులకు సంక్షేమ చట్టాలు అమలు చేయాలని కోరుతున్నా పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. 11న నిర్వహించే మహాసభలో కార్మికుల సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తామని ఓబులు తెలిపారు. ఆనంతరం మహాసభలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు.

ఉమ్మడి 'అనంత'కు రుణపడి ఉంటాం..

ఆర్డీటీ ఎఫ్‌సిఆర్‌ఎ రెన్యువల్ చేయించాం

కనకదాసు విగ్రహావిష్కరణలో విద్యాశాఖమంత్రి నారాలోకేష్

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

అందరికి ఆదర్శప్రాయుడైన కనకదాసు జయంతిని కూటమి ప్రభుత్వంలో అధికారికంగా పండుగల జరుపుకోవడం అదృష్టంగా భావిస్తున్నానని రాష్ట్ర ఐటి, విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ అన్నారు. కనకదాసు 538వ జయంతి సందర్భంగా కళ్యాణదుర్గంలో శనివారం స్థానిక ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి వేడుకలను నిర్వహించారు. అదే సందర్భంలో కంబదూరు బైపాస్ జంక్షన్‌లో ఏర్పాటు చేసిన 9 అడుగుల కనకదాసు కాంస్య విగ్రహాన్ని మంత్రి లోకేష్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈకూడలిని కనకదాసు కూడలిగ నామకరణం చేసినట్లు తెలిపారు. ఉమ్మడి అనంతజిల్లాకు తాముఋణపడి ఉంటామన్నారు. ఎన్టీఆర్‌ను ఇక్కడి నుంచి ఎమ్మెల్యేగా, మామలు హరికృష్ణ, బాలకృష్ణను ఎమ్మెల్యేగా గెలిపించి అందలమెక్కించిన ఘనత జిల్లా వాసులదేనన్నారు. కురుబల విజ్ఞప్తులను సీఎం చంద్రబాబు ఆమోదించారన్నారు. గుడికట్టల పూజారులకు గౌరవవేతనాలిచ్చేందుకు కసరత్తు చేస్తున్నామన్నారు. గొర్రెలకు బీమా సౌకర్యం కోసం చర్యలు తీసుకుంటామని ఎంతోమంది బీసీలకు కార్పొరేషన్ పదవులు కూడా ఇవ్వడం జరిగిందని అన్నారు. ఈజిల్లాకు చెందిన సవితాను బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా ఎంపికచేశామన్నారు. బైరవానితిప్ప ప్రాజెక్టు పనులకు టీడీపీ హయాంలో శంకుస్థాపన జరిగిందని ఆప్రాజెక్టు పనులు పూర్తిచేయడం కూడా టీడీపీ హయంలో జరుగుతుందని అన్నారు. జిల్లా పేదలకు వరప్రదాయినిగా ఉన్న ఆర్డీటీకి కొన్ని కారణాల వల్ల ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యూవల్ ఆలస్యమైందని తానే స్వయంగా ఢిల్లీ పెద్దలతో మాట్లాడి రెన్యూవల్ చేయించానన్నారు. ముమ్ముందు ఆర్డీటీని కొనసాగించుకోవడం బాధ్యతగా తీసుకుంటా మన్నారు. వైసీపీ హయాంలో ఐదేళ్ల చీకటి రాజ్యం నడిచిందని ప్రశ్నించినవారిపై దాడులు చేశారని ఆరోపించారు. పాదయాత్రలో తన దృష్టికి వచ్చిన అంశాలన్నింటిని పరిష్కరిస్తామన్నారు.

కురుబల విజ్ఞాపనలకు సిఎం ఆమోదం : మంత్రి సవిత

వెనుకబడిన తరగతుల సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తున్న కూటమి ప్రభుత్వానికి బీసీలంతా అండగా నిలవాలని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి ఎస్.సవిత పిలుపునిచ్చిరు. కళ్యాణదుర్గంలో భక్త కనకదాసు జయంతి సభలో మంత్రి సవిత మాట్లాడుతూ రాయలసీమలో అధికంగా ఉన్న కురుబ కులస్తులను గుర్తించి కనకదాసు జయంతిని అధికారికంగా నిర్వహించడం, విగ్రహావిష్కరణ చేయడం సంతోషంగా ఉందన్నారు. కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు మాట్లాడుతూ భైరవానితిప్ప ప్రాజెక్టును పూర్తిచేయాల్సిందిగా లోకేష్‌కు విజ్ఞప్తిచేశారు. హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి మాట్లాడుతూ. ఉమ్మడి జిల్లాలో బీసీ భవన్ లు మంజూరు చేయాలని కోఎరారు.

భారీ ర్యాలీ : కళ్యాణదుర్గం పట్టణ, హిందూపురం రోడ్డు, బైపాస్ సర్కిల్ లో స్థానిక ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు నేతత్వంలో ఏర్పాటుచేసిన 9 అడుగుల కాంస్య విగ్రహాన్ని మంత్రి లోకేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. బైపాస్ సర్కిల్ కు శ్రీ భక్త కనకదాస సర్కిల్ గా నామకరణం చేశారు. అంతకుముందు బైపాస్ సర్కిల్ కు వేలాది మంది మహిళలు, స్థానిక ప్రజలతో కలిసి మంత్రి నారా లోకేష్ ర్యాలీగా వెళ్లారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పయ్యావుల కేశవ్, ఎస్.సవిత, ఎంపీలు బీకే పార్థసారథి, అంబికా లక్ష్మీ నారాయణ, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, అనంతపురం జిల్లా టీడీపీ అధ్యక్షులు వెంకట శివుడు, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, కందికుంట వెంకట ప్రసాద్, గుమ్మనూరు జయరాం, దగ్గుబాటి వెంకటేశ్వరప్రసాద్, బండారు శ్రావణిశ్రీ, కురుబ కార్పొరేషన్ ఛైర్మన్ దేవేంద్ర, కార్యక్రమంలో కురుబల కార్పొరేషన్ డైరెక్టర్ దేవేంద్రప్ప, కడప రీజినల్ ఏపీఎస్ఆర్టీసీ చైర్ పర్సన్ పూల నాగరాజు, కలెక్టర్ ఆనంద్, బీసీ వెల్ఫేర్ అడిషినల్ డైరెక్టర్ చంద్రశేఖర్ రాజు, బీసీ వెల్ఫేర్ డిడి కుష్బూ కొఠారి, బీసీ కార్పొరేషన్ ఈడి రామసుబ్బారెడ్డి, ఆయా శాఖల అధికారులు, ఆయా సంఘాల నాయకులతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. తదితరులు పాల్గొన్నారు.



కనకదాస విగ్రహానికి పూలమాల వేస్తున్న మంత్రి నారాలోకేష్, పాల్గొన్న ప్రముఖులు

ప్రజాదర్బార్ : అనంతపురం జిల్లా రెండు రోజు పర్యటనలో భాగంగా విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ కళ్యాణదుర్గం పట్టణంలోని పార్టీ కార్యాలయం వద్ద 71వ రోజు ప్రజాదర్బార్ నిర్వహించారు. తనను కలిసేందుకు వచ్చిన వారి నుంచి వివిధ సమస్యలపై వినతులు స్వీకరించారు. బతుకుదెరువు కోసం మస్కట్ వెళ్లిన తన సోదరి షేక్ జుబేదా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోందని, సరైన తిండి లేక అనారోగ్యం పాలైన ఆమెను క్షేమంగా స్వదేశానికి రప్పించేలా చర్యలు తీసుకోవాలని గుంతకల్లుకు చెందిన షేక్ షబానా మంత్రి నారా లోకేష్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. తన ఇద్దరు కుమార్తెల ఉన్నత చదువుల కోసం ఆర్థికసాయం అందించాలని అనంతపురానికి చెందిన మదమంచి ప్రవీణ్ కుమార్ మంత్రి నారా లోకేష్ కలసి కోరారు. కాంట్రాక్టు లెక్చరర్లను క్రమబద్ధీకరించి న్యాయం చేయాలని ఆంధ్రప్రదేశ్ కాంట్రాక్ట్ లెక్చరర్స్ జేఏసీ ప్రతినిధులు మంత్రి నారా లోకేష్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. అనంతపురం జిల్లా ఉప్పరపల్లిలో తాను ఐదు సెంట్ల ఇంటి స్థలాన్ని కొనుగోలుచేశానని, అయితే రామకృష్ణారెడ్డి, కుమారస్వామిరెడ్డి అనే వ్యక్తులు దౌర్జన్యపూరితంగా తన స్థలాన్ని ఆక్రమించారని పుట్టపర్తి మండలం గువ్వలకుంటపల్లి గ్రామానికి చెందిన ఈ.సురేంద్ర రెడ్డి మంత్రి నారా లోకేష్ ను కలిసి ఫిర్యాదు చేశారు. విచారించి తగిన న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. శ్రీ సత్యసాయి వాటర్ సప్లై ప్రాజెక్టు లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిబ్బంది మంత్రి లోకేష్ ను కలిసి కోరారు. ఆయా విజ్ఞప్తులను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.



పరుగుపందెం పోటీల్లో పాల్గొన్న రెవెన్యూ ఉద్యోగులు



షాట్‌పుట్ పోటీల్లో మహిళా రెవెన్యూ ఉద్యోగి

ఉల్లాసంగా.. ఉత్సాహంగా...

రెండోరోజూ కొనసాగిన రాష్ట్ర స్థాయి రెవెన్యూ క్రీడలు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

స్థానిక ఆర్డీటీ క్రీడామైదానంలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి రెవెన్యూ క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా రెండోరోజు శనివారం జరిగిన క్రీడాపోటీల్లో క్రీడాకారులు ఉల్లాసంగా.. ఉత్సాహంగా పాల్గొన్నారు. శనివారం రెండవ రోజు ఆర్డిటి స్టేడియంలో జరిగిన వివిధ క్రీడలను ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్, డిఆర్‌ఒ మలోల, రాష్ట్ర రెవెన్యూ సర్వీసెస్ అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు, కార్యదర్శి వెంకట రాజేష్, జిల్లా అధ్యక్షులు దివాకర్ తదితరులు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పలు క్రీడలకు టాస్ వేసి ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులను ఉత్తేజపరుస్తూ క్రీడల విధివిధానాలను పాటించి విజయం సాధించాలని సూచించారు. అనంతరం మాంఛోఫెర్రర్ మాట్లాడుతూ ఎంతో ప్రతిష్టాత్మకంగా రాయలసీమ ప్రాంతంలోని అనంతపురం లాంటి కరువు జిల్లాలో జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ సహకారాలతో ప్రభుత్వ యంత్రాంగం క్రీడలను సాంస్కృతిక కార్యక్రమాలను ఆర్టీటీ మైదానంలో జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ప్రతి క్రీడాకారుడు జాతీయస్థాయి పోటీలను లక్ష్యంగా నిర్దేశించుకొని ఆడాలని రెవెన్యూ ఉద్యోగులకు సూచించారు. ఒక వైపు ఉద్యోగం చేసుకుంటూ మరోవైపు క్రీడల్లోనో రాణించాలని క్రీడల వల్ల శారీరక దఢత్వంతో పాటు మానసిక దఢత్వం లభిస్తుందని తెలిపారు. గతంలో ఎన్నడు లేనివిధంగా ఇలాంటి కార్యక్రమాలు ఆర్డీటీ స్టేడియంలో జరుపుకోవడం స్ఫూర్తిదాయకమన్నారు. క్రీడల్లో పాల్గొన్న అన్ని జిల్లాల రెవెన్యూ ఉద్యోగులకు ఆయన అభినందించారు. ఈ సందర్భంగా టేబుల్ టెన్నిస్‌లో అనంతపురం జిల్లాలో విన్నర్‌గా నిలబెట్టిన ఎఫ్ఎస్‌ఒ రామకష్ణారెడ్డిని ప్రత్యేకంగా అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అనంతపురం ఆర్డీవో కేశవ నాయుడు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు మల్లికార్జునుడు, ఆనంద్, రామ్మోహన్, రెవెన్యూ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు దివాకర్ రావు, కార్యదర్శి సోమశేఖర్, స్పోర్ట్స్, కల్చరల్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు సంజీవరెడ్డి, హరిప్రసాద్ రెడ్డి, సత్యసాయి జిల్లా అధ్యక్షులు మధు నాయక్, కార్యదర్శి మైనుద్దీన్, మీడియా ఇన్చార్జి మునివేలు తదితరులు పాల్గొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ క్రీడా పోటీల్లో ఉద్యోగులు చురుకుగా పాల్గొని తమ ప్రతిబా నైపుణ్యాలను ప్రదర్శిస్తూ క్రీడా స్ఫూర్తిని పెంపొందించారు.



రెవెన్యూ ఉద్యోగ సంఘం నాయకులు, ఉద్యోగులతో ఆర్డీటీ పోగ్రాం డైరెక్టర్ మాంఛోఫేర్రర్

ఎమ్మెల్యేలకు మంత్రి లోకేష్ క్లాస్..

అలకబూనిన నేతలకు వార్నింగ్

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

అనంతపురం ఉమ్మడి జిల్లాలో అధికార పార్టీకి చెందిన నలుగురు ఎమ్మెల్యేలకు రాష్ట్ర ఐటి, విద్యాశాఖమంత్రి నారాలోకేష్ క్లాస్ తీసుకున్నట్లు టీడీపీ వర్గాల ద్వారా తెలిసింది.కనకదాసు జయంతి వేడుకల్లో భాగంగా రెండు రోజులు కళ్యాణదుర్గం పర్యటనకు వచ్చిన ఆయన పార్టీ బలోపేతం, క్రమశిక్షణ, కార్యకర్తల మనోభావాలు, ఎమ్మెల్యేల అవినీతి, అక్రమాలు, ఏకపక్ష ధోరణిలపై ముక్కుసూటిగా నిలదీసి హెచ్చరించిన్నట్లు తెలిసింది. ఇందులో అనంతపురం జిల్లాకు చెందిన ముగ్గురు కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలుండగా, సత్యసాయి జిల్లాలో కొత్త ఎన్నికైన మరో ఎమ్మెల్యే ఉన్నట్లు సమాచారం. ఆయా నియోజకవర్గాల్లో అధికార పార్టీలో జరుగుతున్న గ్రూపు రాజకీయాలతో పాటు ఇది వరకు పార్టీ కోసం కష్టపడినవారిని పలు కారణాలతో పట్టించుకోకపోవడం, వారిని ఇబ్బంది పెట్టే చర్యలకు పూనుకోవడంపై అసహనం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ద్వితీయశ్రేణి నాయకత్వంతోపాటు పార్టీలో ప్రముఖంగాఉంటూ ఎమ్మెల్యేల తీరు నచ్చక కార్యక్రమాల్లో అంటిముట్టినట్లు వ్యవహరిస్తున్న నాయకుల నుంచి అందిన ఫిర్యాదులతో సదరు ఎమ్మెల్యేలను గాడిలో పెట్టేందుకు క్లాస్ తీసుకున్నారని టీడీపీ వర్గాలలో చర్చ జరుగుతోంది. వన్ బై వన్ ఎమ్మెల్యేలను పిలిపించుకుని ఆ నియోజకవర్గాలలో వారి వ్యవహారశైలి, అవినీతి, అక్రమాలు, పార్టీకి జరుగుతున్న నష్టాలపై మంత్రి నారాలోకేష్ వద్ద ఉన్న నివేదికల ఆధారంగా క్లాస్ తీసుకున్నట్లు సమాచారం. మంత్రి లోకేష్ మందలింపు అనంతరం సదరు ఎమ్మెల్యేల మొహాల్లో హావాభావాలు మరోరకంగా కనిపించినట్లు కార్యకర్తలు చర్చించుకోవడం కనిపించింది. పార్టీ ఎంతోనమ్మకంగా ఎమ్మెల్యే పదవుల్లో కూర్చొబెడితే టీడీపీకి నష్టం తెచ్చేలా వ్యవహరించడాన్ని సహించబోమని మంత్రి లోకేష్ సుతిమెత్తాగా క్లాస్ తీసుకున్నట్లు తెలియవచ్చింది. ఇదిలాఉండగా 7వ తేదీ రాత్రికి కళ్యాణదుర్గం వస్తున్న సందర్భంలో ఓ మండల కన్వీనర్ గజమాల సిద్ధంచేసుకోగా దానిని స్వీకరించకుండా కాన్వాయి ముందుకెళ్లిపోవడంతో ఆయన అలకబూనారు. దీంతో మంత్రి బసచేసి చోటుకు పిలిపించుకుని ఆయనపై కూడా మంత్రి అసహనం వ్యక్తంచేస్తూ క్లాస్ తీసుకున్నట్లు తెలిసింది. అ ల క బూ ను తా వా . . . క్ర మ శి క్ష ణ లే దా అని...ప్రశ్నించగా తాము మీకోసం కష్టపడి డబ్బులు వెచ్చించి వేచిచూస్తే గజమాల స్వీకరించకపోవడం తమను అవమాన పరిచినట్లైందని ఆ నాయకుడు చెప్పుకునట్లు సమాచారం. దీని పై మంత్రి ఘాటుగా స్పందించి క్రమశిక్షణలేకపోతే బయటకు వెళ్లిపో అంటూ హెచ్చరించగా తన తలతెగిన టీడీపీ నుంచి బయటకు పోనని కుండబద్దలుకొట్టినట్లు బదులిచ్చినట్లు తెలిసింది. మరో మాజీ మహిళా ప్రజాప్రతినిధి భర్త రేషన్‌కార్డులు, పక్కాఇల్లు వెంటనే ఇవ్వాలిసార్ ప్రజలు తమను నిలదీస్తున్నారని చెప్పడంతో అంచలవారిగా చేస్తామని మంత్రి సమాధానం ఇచ్చారు. ఇందుకు సంతృప్తిచెందని సదరు నాయకుడు అధికారంలోకి వచ్చి రెండేళ్లవుతోంది ఇక్కెప్పుడిస్తామంటూ నిట్టూర్చినట్లు మాట్లాడడంతో నీవద్ద ఉంటే రూ.10వేలకోట్లు ప్రభుత్వానికి డిపాజిట్ చేస్తే తక్షణమే అమలు చేస్తామని మంత్రి చెప్పి వ్యాఖ్యానించినట్లు సమాచారం. అంతేకాకుండా దళితులు కూడా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేయకుండా అవమానించారని ధర్నాచేసిన సంగతి తెలిసిందే. మొత్తానికి నారాలోకేష్ రెండు రోజుల పర్యటన కొందరు ఎమ్మెల్యేలకు క్లాస్ పీకడం, అలకబూనిన నాయకులను సముదాయించడం లాంటి వాటితో ముగిసిందని చెప్పవచ్చు.

తొలగని 'అపార్' కష్టాలు..!

తక్కువగా ఆధార్ నమోదు కేంద్రాలు-విద్యార్థుల పడిగాపులు

ప్రజాశక్తి-బొమ్మనహాల్

నెలలు గడుస్తున్నా విద్యార్థులకు అపార్ ఐడి తిప్పలు తప్పడం లేదు. 1వ నుంచి 5వ తరగతి వరకూ ప్రతి విద్యార్థికీ అపార్ ఆధార్ అప్‌డేట్ చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదేశాలు జారీ చేయడంతో విద్యార్థులకు లేనిపోని తిప్పలు వచ్చాయనే విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో 11 వేల మంది విద్యార్థులు విద్యాభ్యాసం పొందుతున్నారు. వీరందరికీ ఆయా పాఠశాలల్లోనే పది రోజులు ఆధార్ సెంటర్ ఏర్పాటు చేసి ఆధార్‌ను అప్‌డేట్ చేయాలని కలెక్టర్ ఆదేశాలు ఇచ్చారు. అయితే కలెక్టర్ ఆదేశాలను అమలు చేయడంలో మండల స్థాయి అధికారులు పూర్తిగా విఫలమయ్యారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత జూన్ మాసం నుంచి నేటికి 45 శాతం విద్యార్థులు ఆధార్ అప్‌డేట్ కాలేదని తెలుస్తోంది. వీరందరూ అపార్ ఐడి పొందాలంటే తప్పనిసరిగా ఆధార్‌ను అప్‌డేట్ చేసుకోవాలి. మండలంలో బొమ్మనహాల్, లింగదహాల్, ఎలంజి గ్రామాల్లో మాత్రమే ఆధార్ అప్‌డేట్ సెంటర్లు ఉన్నాయి. అయితే వీటిలో కూడా ఎలంజి సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ ఆరునెలలు సెలవుపై వెళ్లాడు. లింగదహాల్ సచివాలయంలో పని చేసే ఆయన డిప్యూటేషన్‌పై గుత్తికి వెళ్లారు. ఇక మిగిలింది బొమ్మనహాల్ మాత్రమే. ఇక్కడి వచ్చి ఆధార్‌ను అప్‌డేట్ చేయించుకోవాలంటే వారాలకు వారాలు పడుతోందని విద్యార్థులు వాపోతున్నారు. చేసేది లేక రోజూ ఆధార్ సెంటర్ వద్దకు వచ్చి పడిగాపులు కాస్తున్నామని చెబుతున్నారు. తగినన్ని ఆధార్ సెంటర్లు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎందుకంటే తల్లిదండ్రులు ఉదయం పొలం పనులకు వెళ్లి సాయంత్రం ఇంటికి వస్తారు. వారు పనులకు వెళ్లకుండా కుటుంబం గడవదు. ఈ పరిస్థితుల్లో దిక్కుతోచని స్థితిలో ఉన్నామని చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి మండలంలో తగినన్ని ఆధార్ అప్‌డేట్ సెంటర్లను ఏర్పాటు చేసి తమ కష్టాలు తీర్చాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.



ఆధార్ సెంటర్ వద్ద పడిగాపులు కాస్తున్న విద్యార్థినులు

జెవివి అభివృద్ధిలో రోగప్ప పాత్ర కీలకం

మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ ఎం.గేయానంద్



సంతాపసభలో మాట్లాడుతున్న డాక్టర్ గేయానంద్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

మంత్రి గారి రోగప్ప ఉమ్మడి అనంతపురం జిల్లా జన విజ్ఞాన వేదిక అభివృద్ధికి ఎంతో కషి చేశారని అలాంటి వ్యక్తి లేకపోవడం సంఘానికి తీరని లోటు అనిమాజీ ఎమ్మెల్సీ డాక్టర్ ఎం.గేయానంద్ అన్నారు. జన విజ్ఞాన వేదిక జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక సంగమేష్ నగర్‌లోని జెవివి ఆఫీస్‌లో మంత్రిగారి రోగప్ప సంతాపసభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రోగప్ప చిత్రపటానికి మాజీ ఎమ్మెల్సీ గేయానంద్ పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ అప్పటి రాష్ట్ర ప్రభుత్వం, జన విజ్ఞాన వేదిక కలిసి నిర్వహించిన అక్షరాస్యత కార్యక్రమంలో రోగప్ప ఎంతో చురుగ్గా పాల్గొన్నారని చెప్పారు. 'పల్లె సుద్దులు' అనే సాంస్కృతిక కార్యక్రమంలో రోగప్ప చాలా కీలకంగా వ్యవహరించారని తెలిపారు. 30 ఏళ్లుగా జన విజ్ఞాన వేదికతో ఆయనకు ఎంతో అనుబంధం ఉందని అలాంటి వ్యక్తి మన మధ్యన లేకపోవడం చాలా బాధాకరమని అన్నారు. ఉద్యమ సహచరుడు మన మధ్యన లేకపోవడం చాలా ఆవేదన కలిగించే విషయం అన్నారు. అక్టోబర్ 31న ఆయన మరణించారనే వార్త జీర్ణించుకోలేకపోయానని రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ సాకే భాస్కర్ అన్నారు. అక్షరాస్యత కార్యక్రమం జయప్రదం చేయాలని ఉద్దేశంతో ఆనాడు ఊరూరా సైకిళ్ల మీద తిరిగేవారమని, వృత్తిరీత్యా ఉపాధ్యాయుడు అయినప్పటికీ పల్లె భాషలో చాలా సహజంగా మాట్లాడి ఎదుటి వాళ్లను నవ్వించడం ఆయనలో గొప్ప లక్షణమని గుర్తు చేసుకున్నారు. జెవివి జిల్లా అధ్యక్షులు కె.పి.చిత్తప్ప అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో జెవివి జిల్లా ఇన్‌చార్జి డాక్టర్ ఆదిశేషు, రాష్ట్ర కమిటీ సభ్యులు డాక్టర్ పి.ప్రసూన, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వీరరాజు, జిల్లా కోశాధికారి మహమ్మద్ జిలాన్, మాజీ జిల్లా అధ్యక్షుడు పి.వెంకటరామిరెడ్డి, మాజీ జిల్లా కార్యదర్శి కెంచా లక్ష్మీనారాయణ, జిల్లా నాయకులు జగదీష్, అర్జున్ నాయక్, ప్రసాద్ రెడ్డి, తిరుపాల్, రామిరెడ్డి, రామకృష్ణ, ప్రసాద్, శాంతరాజు, రాఘవేంద్ర, సింహాద్రి, సమత నాయకురాలు నాగరత్న, శశికళ, లలిత తదితరులు పాల్గొన్నారు.


కరువు కనబడలేదు.. !

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వానికి కరువు కనబడలేదు. అనంతపురం జిల్లాలో ఒక్క కరువు మండలం కూడా ప్రకటనవలేదు. సత్యసాయి జిల్లాలో కొన్ని మండలాలు కరువు మండలాల జాబితాలోనున్నప్పటికీ అనంతపురం జిల్లాలో మాత్రం కరువు ఈ ఏడాది లేనట్టుగానే ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల ద్వారా స్పష్టమవుతోంది. వాస్తవానికి ఈ సీజన్ ప్రారంభమైన జూన్ నుంచే వర్షాభావం నెలకొంది. జులైలోనూ అదే పరిస్థితి కొనసాగింది. ఒక్క ఆగస్టు నెలలో మాత్రం వంద శాతం వరకు అధిక వర్షపాతం నమోదయింది. ఆ తరువాత సెప్టెంబరులోనూ వర్షాభావమే కొనసాగింది. వర్షాధారం కింద సాగయ్యే పంటలకు సాధారణంగా సకాలంలో వర్షాలు పడాల్సి ఉంటుంది. అందులోనూ విత్తనం విత్తుకునే సమయంలో మంచి పదును కావాలి. జిల్లాలో విత్తనం విత్తుకునే జులై మాసంలో తీవ్ర వర్షాభావం నెలకొంది. ఈ ప్రభావం ఖరీఫ్ పంటల సాగు విస్తీర్ణంపైనా పడింది. ఆగస్టు వరకు 50 శాతం కూడా పంటలు సాగవలేదు. ఆగస్టులో పడిన వర్షాలకు ప్రధాన పంట వేరుశనగ కాకుండా ఇతర పంటలు సాగు చేసుకున్నారు. ప్రధాన పంట వేరుశనగ సాగుకు సిద్ధమైన రైతులు విత్తనం విత్తుకోకుండా నష్టపోయారు. ఆ తరువాత ఆగస్టులో పడిన వర్షాలకు ఇతర పంటలు సాగు చేసినప్పటికీ సాగు లక్ష్యం కంటే రెండు లక్షల ఎకరాలు తక్కువగానే పంటలు సాగు చేశారు. అంటే రెండు లక్షల ఎకరాలు ఖరీఫ్‌లో బీడుగానే ఉండిపోయింది. సరైన వర్షపాతం లేకపోవడం వలనే పంటలను రైతులు సాగు చేసుకోలేకపోయారు. సాగుచేసిన రైతులకు కూడా సరైన వర్షాల్లేక నష్టపోయే పరిస్థితి వచ్చింది. అయితే ప్రభుత్వం ఆగస్టులో పడిన అధిక వర్షం కూడా కలిపి కరువు మండలాల ప్రకటనలో లెక్కించడంతోనే జిల్లాలో ఒక్క మండలం కూడా కరువు మండలాల జాబితాలో చోటు దక్కన్నట్టు తెలుస్తోంది. దీనిపై రైతు సంఘాలు, విపక్ష పార్టీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. సరైన సమయంలో వర్షాల్లేక రైతులు నష్టపోయారని చెబుతున్నారు. గతేడాది కూడా ఇదే రకంగా జిల్లాకు నష్టం జరిగిందన్న వాదనలు వినిపిస్తున్నారు. కేవలం ఏడు మండలాలు మాత్రమే కరువు మండలాలు ప్రకటించేసింది.దీనికి కూడా ఇన్‌పుట్ సబ్సిడీ ఇంత వరకు విడుదల చేయలేదు. వాతావరణ బీమా పరిస్థితి ఏమిటన్న అయోమయం ఇంకా కొనసాగుతోంది,. ఇలా ఈ వారంలో కరువు మండలాల ప్రకటన ప్రధాన చర్చ నడుస్తోంది. ఇంత జరుగుతున్నా ప్రజాప్రతినిధులు మాత్రం దీనిపై పెదవి విప్పడం లేదు. కరువు మండలాల ప్రకటనలో ఏమి జరిగిందన్న దానిపై సమీక్ష జరిపిన దాఖలాల్లేవు. ఇక ఈ వారంలో రెవెన్యూ ఉద్యోగుల రాష్ట్ర స్థాయి క్రీడలకు అనంతపురం వేదికైంది. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి వచ్చి ఎంతో ఉత్సహపూరిత వాతావరణంలో జరుగుతున్నాయి. ఆదివారంతో ఈ ఉత్సవాలు ముగియనున్నాయి. ఈసందర్భంగా రాష్ట్ర స్థాయి రెవెన్యూ అధికారులు పెద్దఎత్తున పాల్గొంటారు. ఇక కళ్యాణదుర్గంలో రెండు రోజులపాటు విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ విచ్చేశారు. కనకదాసు విగ్రహావిష్కరణ చేపట్టారు. ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ వారంలో రాష్ట్రమంతా పెద్దఎత్తున వర్షాలు పడినప్పటికీ జిల్లాలో మాత్రం తక్కువగా పడింది. రబీలోనూ పంటల సాగు ఆశించినంత గా జరగడం లేదు. రబీ ప్రధాన పంట పప్పుశనగ సాగు విస్తీర్ణం కూడా తక్కువగానే ఉంది. సబ్సిడీ విత్తనం పంపిణీ ఇప్పుడు ఆరంభమైంది.



నేటి తరానికి స్ఫూర్తి ..పప్పూరు రామాచార్యులు



పప్పూరు రామాచార్యులుకు నివాళులర్పిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-అనంతపురం

సమాజ పురోగతికోసం జీవితమంతా విభిన్న రంగాల్లో కృషి చేసిన స్వాతంత్ర్య సమరయోధుడు, సాధన పత్రిక సంపాదకులు పప్పూరు రామాచార్యులు నేటితరాలకు స్ఫూర్తిగా నిలుస్తారని కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత, పరిశోధకులు అప్పిరెడ్డి హరినాథరెడ్డి కొనియాడారు. పప్పూరు రామాచార్యులు జయంతిని పురస్కరించుకుని శనివారం స్థానిక వేమన కేంద్రంలో ఫౌండేషన్ ఉపాధ్యక్షులు కృష్ణారెడ్డి అధ్యక్షతన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హరినాథరెడ్డి మాట్లాడుతూ పప్పూరు రామాచార్యులు సాధన పత్రిక ద్వారా ఈ ప్రాంత సాహిత్య సాంస్కృతిక వికాసంతో పాటు జాతీయోద్యమ నిర్మాణంలో ప్రధానపాత్ర పోషించారన్నారు. పప్పూరి వారు విద్యార్థి దశలోనే వదరుబోతు కరపత్రాలు ప్రచురించి అనంతపురం వీధుల్లో పంచి ఈ ప్రాంతంలో జర్నలిజం వికాసానికి పునాదిగా నిలిచారన్నారు. అంతేగాకుండా అనంతపురం తొలి మున్సిపల్ ఛైర్మన్‌గా, గ్రంథాలయ సంస్థ అధ్యక్షులుగా, కో అపరేటీవ్ బ్యాంకు ఛైర్మన్‌గా, లలిత కళాపరిషత్, హరిజన సేవాసదన్, నేషనల్ సాయిబాబా కళాశాల తదితర అనేక సంస్థల్లో తనదైన ముద్రవేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు శ్రీనివాసరెడ్డి, ప్రజాసంఘాల నాయకులు రమణ, రాహుల్, కవులు సూర్యం, నర్సిరెడ్డి, పర్యావరణ కార్యకర్త ఎవిరెడ్డి , రవికుమార్, నాగశేషారెడ్డి, లోకన్న, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

టీకా ఆరోగ్య భద్రతకు మూలస్తంభం

సవీరా పీడియాట్రిక్, నియోనాటాలజిస్టు మౌనికారెడ్డి



ప్రజాశక్తి-అనంతపురం

మనిషి ఆరోగ్యంగా ఉండాలంటే శరీరంలో రోగ నిరోధక శక్తి ఉండాలని, ఇది కావాలంటే వయసురీత్యా మరిచిపోకుండా తప్పనిసరిగా టీకాలు వేయించుకోవాలని సవీరా పీడియాట్రిక్, నియోనాటాలజిస్టు మౌనికారెడ్డి సూచించారు. నవంబర్ 10వ తేదీన అంతర్జాతీయ రోగనిరోధక దినోత్సవాన్ని పురస్కరించుకుని టీకాల ఆవశ్యకతపై ప్రజాశక్తికి వివరించారు. టీకాలు తీసుకోవడం వల్ల బలహీన పడుతారని, అనారోగ్యాలకు గురవుతారని ప్రజల్లో అపోహాలు ఉన్నాయన్నారు. అది అబద్ధమన్నారు. టీకాల ఆవశ్యకతపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలన్నారు. టీకాల వల్ల ప్రాణాంతక వ్యాధులు నివారణ అవుతాయన్నారు. ముఖ్యంగా చిన్నపిల్లల్లో రోగ నిరోధకశక్తి తక్కువగా ఉంటుందన్నారు. పోలియో, మీజిల్స్ (తట్టు), కోరింత దగ్గు, టెటానస్ (ధనుర్వాతం), డిఫ్తీరియా, హెపటైటిస్–బి వంటి ప్రమాదకరమైన వ్యాధుల నుంచి టీకాలు రక్షిస్తాయన్నారు. టీకాలు వేయకపోతే న్యుమోనియా, చెవుడు, అంధత్వం, మెదడు దెబ్బతినడం, మరణం వంటి తీవ్రమైన, శాశ్వత వైకల్యాలకు దారితీయవచ్చన్నారు. టీకా లేకపోతే పిల్లలు, వయోజనులు వ్యాధులకు గురి కావచ్చు, తీవ్ర గాయాలు, శాశ్వత అవరోధాలు, మరణాలు సంభవించవచ్చన్నారు. తల్లిదండ్రులుగా పిల్లలకు ఉత్తమమైన ఆరోగ్యాన్ని అందించడం మన ప్రాథమిక బాధ్యత అన్నారు. కావున పిల్లల టీకా షెడ్యూల్‌ను జాగ్రత్తగా పాటించి ఒక డోస్ కూడా తప్పకుండా అన్ని టీకాలు వేయించాలన్నారు.

ఒత్తిడికి ఉపశమనం 'హాస్యమే'


'మానవత' కన్వీనర్ తరిమెల అమర్‌నాథ్‌రెడ్డి


అతిథులను సన్మానిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సమాజంలో నిత్యం ఉరుకులు, పరుగులు, జీవనం సాగిస్తున్న మానవులు తీవ్ర ఒత్తిళ్లకు గురవుతుంటారని, వాటిని అధిగమించేందుకు ఉపశమనంగా హాస్యం ఒక్కటే ఉపయుక్తంగా ఉంటుందని మానవతా కన్వీనర్ తరిమెల అమర్‌నాథ్‌రెడ్డి అన్నారు. నగరంలోని వివేకానంద యోగా కేంద్రంలో శనివారం హాస్య భారతి ఆధ్వర్యంలో 'హాస్య వల్లరి' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి ఉరుకుల పరుగుల జీవితంలో మానసిక ఒత్తిడి నుండి ఉపశమనం కేవలం హాస్యంతోనే సాధ్యమన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఆరోగ్యకరమైన హాస్య సమ్మేళనం అవసరం ఎక్కువగా ఉందని, తన అనుభవాల్ని హాస్యాన్ని జోడించి ఆసీనులను అలరించారు. ఈ కార్యక్రమంలో గుంటి మురళీకృష్ణ, మానవత కో–కన్వీనర్ సలీమ్‌మాలిక్ విశ్రాంత ఆర్టీసీ ఉద్యోగి శ్రీనివాసులు, ఉపాధ్యాయులు మిద్దె మురళి, న్యాయవాదులు షేక్ సైఫుద్దీన్, శ్రీనివాసులు, మహిళా మిమిక్రీ, యోగా శిక్షణ నిపుణులు కృష్ణవేణి, మాలతి, విశ్రాంత ఉపాధ్యాయులు రియాజుద్దీన్, షరీఫ్, రవిచంద్ర, సాధు శేఖర్, దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు 'మాంటిస్సోరీ' విద్యార్థులు


ప్రతిభ కనబరిచిన మాంటిస్సోరీ విద్యార్థులు

ప్రజాశక్తి-రాప్తాడు

మండలంలోని గొల్లపల్లి సమీపంలో ఉన్న మాంటిస్సోరీ ఎలైట్ ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు రాష్ట్రస్థాయి బ్యాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ఎండి కృష్ణభరత్, కరస్పాండెంట్ కృష్ణసమీరా, ప్రిన్సిపాల్ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. మాంటిస్సోరీ ఎలైట్ విద్యార్థులు పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న సోనాక్షి, పూజిత, హితేష్ అండర్–14 కేటగిరి జిల్లాస్థాయి బ్యాస్కెట్‌బాల్ పోటీల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరు ఈనెల 23, 24, 25వతేదీల్లో మదనపల్లిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులతోపాటు కోచ్ ప్రసాద్‌ను అభినందించారు.

పిఆర్ ఇంజినీర్ల అసోసియేషన్ ఏర్పాటు



పిఆర్ ఇంజినీర్ల అసోసియేషన్ సభ్యులను సన్మానిస్తున్న అతిథులు

ప్రజాశక్తి-అనంతపురం/గుత్తి

పంచాయతీ రాజ్ ఇంజినీర్ల అసోసియేషన్ ఎన్నికలు రాష్ట్ర అధ్యక్షులు సంగీతరావు ఆధ్వర్యంలో సజావుగా సాగాయి. జిల్లా గౌరవాధ్యక్షులుగా గుత్తి పిఆర్ సబ్ డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ డి.ఎల్.మురళీధర్, అధ్యక్షులుగా అనంతపురం డిఇఇ కె.లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులుగా జింకల నారాయణస్వామి (డిఇఇ), జింకల కృష్ణజ్యోతి (డిఇఇ), ప్రధాన కార్యదర్శిగా గోపాల్‌నాయక్, కోశాధికారి పాండురంగారెడ్డి (డిఇఇ), ఆర్గనైజింగ్ కార్యదర్శి ఓబులేసును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. తర్వాత కొత్త కార్యవర్గాన్ని పూలమాలలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

డ్రెయినేజీ సమస్యకు పరిష్కారం

ఎమ్మెల్యే శ్రావణిశ్రీకి సోదనపల్లివాసుల కృతజ్ఞతలు

ప్రజాశక్తి-శింగనమల

మండల పరిధిలోని సోదనపల్లి గ్రామంలో డ్రెయినేజీ సమస్యను పరిష్కరించారు. గత కొద్దిరోజుల క్రితం టిడిపి నిర్వహించిన 'సూపర్ సిక్స్–సూపర్ హిట్' కార్యక్రమంలో భాగంగా సోదనపల్లికి వచ్చిన ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీకి ఎస్‌సి కాలనీ వాసులు అస్తవ్యస్తంగా ఉన్న డ్రెయినేజీ సమస్యపై విన్నవించారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే కాలనీలో వెంటనే సమస్య పరిష్కరించాలని అధికారులు ఆదేశాలు చేశారు. ఈ సందర్భంగా సీసీ రోడ్డు వేసి డ్రెయినేజీ సమస్యను పరిష్కరించారు. గత వైసిపి ప్రభుత్వంలో ఎన్నోసార్లు పాలకులు గ్రామాన్ని సందర్శించినా సమస్యను పరిష్కరించక పోయారు. ప్రస్తుత ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీకి సమస్యను విన్నవించిన వెంటనే పరిష్కరించిన ందుకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.


సమస్యకు ముందు, తర్వాత ఉన్న డ్రెయినేజీ

'శ్రీరామిరెడ్డి' కార్మికులపై వేధింపులు, తొలగింపులు ఆపాలి

మంత్రి నారా లోకేష్‌కు సిఐటియు నాయకుల వినతి


నారా లోకేష్‌కు సమస్యలను వివరిస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

ఉమ్మడి అనంతపురం జిల్లాలోని కళ్యాణదుర్గం డివిజన్ పరిధిలో కొనసాగుతున్న శ్రీరామిరెడ్డి తాగునీటి సరఫరా పథకం కార్మికులపై అక్రమ తొలగింపులు, వేధింపులు ఆపాలని సిఐటియు అనంతపురం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆర్‌వి.నాయుడు, ఎస్.నాగేంద్రకుమార్ డిమాండ్ చేశారు. ఈమేరకు కళ్యాణదుర్గం పర్యటనకు వచ్చిన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను సిఐటియు నాయకులు శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీరామిరెడ్డి తాగునీటి సరఫరా పథకంలో 17ఏళ్లుగా 600 మంది కార్మికులు 900 గ్రామాలకు నీటి సరఫరా చేస్తున్నారన్నారు. అయితే కాంట్రాక్టర్ అడపాల వెంకటరావు కార్మికులపై దౌర్జన్యంగా బెదిరింపులకు పాల్పడుతూ బలవంతంగా రూ.100 ఖాళీ బాండ్‌లపై సంతకాలు సేకరిస్తూ భయాందోళనలకు గురి చేస్తున్నాడని లోకేష్ దృష్టికి తీసుకొచ్చారు. కొంతమందిని అక్రమంగా తొలగిస్తున్నాడని తెలిపారు. వేతనాల చెల్లింపుల్లో రూ.17000 నుంచి రూ.11000 తగ్గించడం, పిఎఫ్, ఇఎస్ఐ ఆ వేతనంలోనే ఉంటాయని ఆదేశించడం వంటి చట్ట వ్యతిరేక చర్యలకు కాంట్రాక్టర్ పాల్పడుతున్నారని తెలిపారు. అశాస్త్రీయమైన లీటర్ బేస్‌విధానం ప్రవేశపెట్టి కార్మికులను అభద్రతకు గురి చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం స్పందించి కార్మికుల సమస్యలు పరిష్కరించి భరోసా కల్పించాలన్నారు. అలాగే విధుల నుంచి తొలగించిన 23 మంది కార్మికులను విధుల్లోకి తీసుకోవాలన్నారు. కాంట్రాక్టర్ అడపాల వెంకటరావు, సూపర్‌వైజర్ కిరణ్‌పై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు. మోటార్లు, పంపు లీకేజీలకు సకాలంలో స్పందించే ప్రత్యేక మారంటేన్‌జేన్ బృందాన్ని ఏర్పాటు చేయాలన్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి మంత్రి నారా లోకేష్ సానుకూలంగా స్పందించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులు వన్నూరుస్వామి, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

జిజిహెచ్ పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

అనంతపురం కలెక్టరేట్ : అనంతపురం ప్రభుత్వ సర్వజనాసుపత్రి, సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రిలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులు, సూపర్‌వైజర్ల తొలగింపులు, వేధింపులు ఆపాలని మంత్రి నారా లోకేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్వజనాసుపత్రి శానిటేషన్ వర్కర్స్ యూనియన్ నగర అధ్యక్షులు నల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

'కోటి సంతకాల'తో ప్రభుత్వ కళ్లు తెరిపిద్దాం

వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి శైలజనాథ్


పండ్ల వ్యాపారితో సంతకం చేయిస్తున్న మాజీ మంత్రి సాకే శైలజానాథ్

ప్రజాశక్తి-నార్పల

పాలన చేతకాక వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్న అసమర్థ కూటమి ప్రభుత్వాన్ని కోటి సంతకాల కార్యక్రమంతో కళ్ల తెరిపిద్దామని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సాకే శైలజనాథ్ పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలోని పాత బస్టాండ్ సమీపంలో ఉన్న స్థానిక శివకళాజ్యోతి ఆవరణలో మండల కన్వీనర్ ఖాదర్ వలిఖాన్ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా గత ప్రభుత్వంలో అప్పటి సిఎం జగన్ రాష్ట్రంలో 17 వైద్య కళాశాలలకు అనుమతులు తీసుకొచ్చారని గుర్తు చేశారు. పేద విద్యార్థులకు వైద్య విద్యను చేరువ చేయడమే లక్ష్యంగా వైద్య కళాశాల నిర్మాణాలు చేపడితే.. వాటిని కూటమి ప్రభుత్వం ప్రయివేటీకరణ చేయాలని చూడటం సిగ్గు చేటన్నారు. ప్రభుత్వం వైద్య కళాశాలను ప్రయివేటుపరం చేసి కూటమి ప్రభుత్వ బినామీలకు రూ.వేల కోట్లు దండుకోవడానికి పూనుకున్నారన్నారు. అమరావతిలో టిడిపి నేతల భూములకు ధరలు పెంచుకునేందుకే రాజధాని నిర్మాణంపై ప్రత్యేక దృష్టి పెడుతున్నారన్నారు. వైద్య విద్య అభ్యసించాలనుకునే విద్యార్థుల కోసం చేపట్టిన కోటి సంతకాల కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ ఛైర్‌పర్సన్ నాగరత్నమ్మ, ఎంపిపి నాగేశ్వరరావు, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శులు మిద్దె కుళ్లాయప్ప, చాములూరు రాజగోపాల్, నియోజకవర్గ బీసీ సెల్ నాయకులు పట్నం ఫణీంద్ర ఎంపిటిసిలు శంకర్‌యాదవ్, కాటమయ్య, రాజారెడ్డి, పద్మాకర్‌రెడ్డి, సర్పంచులు కుళ్లాయిరెడ్డి, రాంభూపాల్‌రెడ్డి, రామాంజనేయులు, రమణకుమారి, మాజీ కోఆప్షన్ సభ్యులు దాడితోట బాషా, మార్కెట్ మాజీ డైరెక్టర్ అమీర్‌బాషా, జిలాన్‌బాషా, భాస్కర్‌నాయుడు, గుత్తి గోపాల్‌రెడ్డి, ఆదినారాయణ, ముచ్చుకుంటపల్లి శ్రీరామిరెడ్డి, వెంకట నారాయణ రెడ్డి, మంగపట్నం శివారెడ్డి, దుగుమరి నారాయణరెడ్డి, గూగూడు శివయ్య, గూగూడు మాజీ సర్పంచు శివశంకర్ రెడ్డి, వైసిపి యూత్ నాయకులు సోహెల్, నౌషాద్, దాదాపీర్, హరినాథ్‌రెడ్డి, గవ్వల సాయి, మహేష్‌నాయక్, గవ్వల ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం కలెక్టరేట్ : మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణ నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించాలని కోరుతూ వైసిపి మేథావుల ఫోరం ఆధ్వర్యంలో శనివారం స్థానిక గుత్తి రోడ్డు మార్కెట్ యార్డులో కోటి సంతకాల సేకరణ చేపట్టారు. ఇందులో భాగంగా గొర్రెల మార్కెట్‌లో గొర్రెల వ్యాపారులు, రోడ్డుపై వెళ్తున్న వాహనదారులు, ప్రజలతో సంతకాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మేథావుల ఫోరమ్ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ శంకరయ్య, రాష్ట్ర కార్యదర్శి కట్టుబడి తానీషా, జిల్లా రిటైర్డ్ ప్రిన్సిపాల్ జనార్ధన్ రెడ్డి, రిటైర్డ్ లెక్చరర్ మహాదేవరెడ్డి, వైసిపి నాయకులు ఎన్.దాసిరెడ్డి, వై.సూర్యనారాయణరెడ్డి, మహబూబ్‌పీరా, హాజీబాషా తదితరులు, పాల్గొన్నారు.

పుట్లూరు : మండలంలోని బాలపురం గ్రామంలో వైసిపి మండల అధ్యక్షులు పొన్నపాటి మహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు ప్రసాద్‌రెడ్డి, చంద్రశేఖర్‌నాయుడు, రాముడు, దశ, శ్రీనివాస్‌రెడ్డి, రామలక్ష్మిరెడ్డి, గంగాధర్‌రెడ్డి, శంకర, రామాంజులనాయుడు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చలో ఢిల్లీని జయప్రదం చేద్దాం


గుత్తిలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు

ప్రజాశక్తి-గుత్తి

సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయిపై జరిగిన దాడిని నిరసిస్తూ ఈనెల 17వతేదీన ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపకులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేద్దామని ఎంఆర్‌పిఎస్ జిల్లా నాయకులు ఎన్.ఈరన్న పిలుపునిచ్చారు. ఈమేరకు శనివారం పట్టణంలోని ఆర్‌అండ్‌బి అతిథిగృహంలో ఇందుకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు నగదాని సత్య, చలపతి, అయ్యప్ప, ఓబులేసు, లక్ష్మన్న, లక్ష్మీనారాయణ, రూపేష్, సూర్యనారాయణ, ఓబయ్య,నాగేష్,ఆర్. వెంకటేష్, చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర కమిటీ పిలుపు, జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు ఉసురుపాటి బ్రహ్మయ్య ఆదేశాల మేరకు రాయదుర్గం అంబేద్కర్ నగర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద శనివారం 'హలో మాదిగ– చలో ఢిల్లీ' పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎంఎంజెఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దానప్ప, ఎఎల్‌డిబిఎస్‌పి నాయకులు ఉల్లిగప్ప మాట్లాడుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయిపై జరిగిన దాడిని ఖండిస్తున్నట్లు చెప్పారు. జిల్లా అధ్యక్షులు గురుమూర్తి మాట్లాడుతూ ప్రధాన న్యాయమూర్తి పై దాడి చేసిన న్యాయవాది రాకేష్ కిషోర్‌ను అరెస్టు చేసి, కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు సాకే గురుమూర్తి, గంగాధర, గోవిందు, రాయదుర్గం తాలూకా అధ్యక్షులు వన్నూరు స్వామి, సమితి నాయకులు నల్లప్ప, తిప్పేస్వామి, ఉదయ్ కుమార్, సురేష్, మహేష్, మల్లి, తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైసిపి నాయకులు

'ప్రజా ఉద్యమం' పోస్టర్లు విడుదల

ప్రజాశక్తి-అనంతపురం

ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి ఆధ్వర్యంలో ఈనెల 12వతేదీన నిర్వహించనున్న 'ప్రజాఉద్యమం' పోస్టర్లను శనివారం నగరంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తోందన్నారు. ధనార్జనే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నారన్నారు. మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ వైసిపి ఆధ్వర్యంలో చేపట్టిన 'ప్రజాఉద్యమం' కోటి సంతకాల సేకరణ విజయవంతంగా కొనసాగుతోందన్నారు. కూటమి ప్రభుత్వంపై మరింత ఒత్తిడి తేవడానికి ఈనెల 12వ తేదీన అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో నిరసన ర్యాలీలు చేపట్టి అధికారులకు వినతిపత్రాలు అందజేస్తామన్నారు.

అడవులు పెంచడం అందరి బాధ్యత

ఒటిపిఆర్ఐ డైరెక్టర్ జివి. సుబ్బారెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

సామాజిక అడవులు పెంచడం అందరి బాధ్యత అని ఒటిపిఆర్ఐ డైరెక్టర్ జివి సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం జెఎన్‌టియు ఒటిపిఆర్ఐలో మిషన్ హరిత ఆంధ్రప్రదేశ్, వనం–మనం కార్యక్రమంలో భాగంగా సంస్థ ఆవరణలో ఆయుర్వేద, వనమూలికల సంబంధించిన మొక్కలు, బీజాలను నాటారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పచ్చదనాన్ని 50 శాతం పెంచడానికే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యావరణ, అడవులు, శాస్త్ర సాంకేతిక విభాగం వారు ప్రతిష్ఠాత్మకంగా 'మిషన్ హరితాంధ్రప్రదేశ్' చేపట్టారన్నారు. ఇందులో భాగంగా సంస్థ ఆవరణలో 20 మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఒటిపిఆర్ఐ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎస్ లహరి, కె.సుధాకర్, ఎన్ఎస్–ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.


మొక్కలను నాటుతున్న విద్యార్థులు

బిసి సంక్షేమ శాఖ అధికారులతో సమీక్ష

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అమలవుతున్న వివిధ కార్యక్రమాలు, పథకాలు, విద్యార్థుల సంక్షేమంపై బిసి సంక్షేమ శాఖ కార్యదర్శి సత్య నారాయణ ఆ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లావ్యాప్తంగా ఉన్న బి.సి. వసతిగృహాలు, మహాత్మాజ్యోతి బాపూలే, బి.సి. గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలు, భోజనం నాణ్యత, పాఠశాల వాతావరణం, శిక్షణా కార్యక్రమాల అమలు వంటి అంశాలను సమగ్రంగా చర్చించారు. ప్రత్యేకంగా పదవ తరగతి విద్యార్థులు రాబోయే పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు తగిన పాఠ్య ప్రణాళికలు, అదనపు తరగతులు, మార్గదర్శక కార్యక్రమాలను నిర్వహించాలని కార్యదర్శి సూచించారు. విద్యార్థుల్లో పోటీ దృక్పథం పెంపొందించడానికి, మానసిక ఉత్సాహం కలిగించడానికి ప్రోత్సాహక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వసతిగృహాల శుభ్రత, భద్రత, నీటి సరఫరా, ఆహార నాణ్యత, హాజరు నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అదనపు సంచాలకులు డి.చంద్రశేఖర్ రాజు, జిల్లా బిసి సంక్షేమ శాఖ డిడి ఖుష్బూ కొఠారి, సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.


వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

జిల్లావ్యాప్తంగా పోలీసుల తనిఖీలు

అనంతపురం : ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా పోలీసులు శనివారం సాయంత్రం వాహనాల తనిఖీలు చేపట్టారు. ఇందులో భాగంగా ప్రతి వాహనాన్ని తనిఖీ చేసి గంజాయి, తదితరాలు ఏవి అక్రమ రవాణా జరుగకుండా చర్యలు చేపట్టారు. ముఖ్యంగా రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు.

పుట్లూరు : మండల పరిధిలోని కడవకల్లు గ్రామ సమీపంలో సిఐ సత్తిబాబు ఆధ్వర్యంలో శనివారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఇందులో భాగంగా రికార్డులు సరిగా లేని వాహనాలకు అపరాధ రుసుం విధించారు. అనంతరం వాహనదారులకు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలని ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ పెట్టుకోవాలన్నారు. ఫోర్‌వీల్ వాహన నడిపే వారు సీట్ బెల్ట్ పెట్టుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

మద్యం దుకాణాలకు రీనోటిఫికేషన్

గుత్తి : గుత్తి ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నాలుగు మద్యం దుకాణాలకు రీనోటిఫికేషన్ జారీ చేసినట్లు ఎక్సైజ్ సిఐ కె.ఉమాదేవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 62 (కరిడికొండ), 63 (కొత్తపేట), 66 (పామిడి), 72 (పెద్దవడుగురు మండలం మిడుతూరు) మద్యం దుకాణాలకు రీనోటిఫికేషన్ ఇచ్చామన్నారు. ఈనెల 10వతేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 12వ తేదీన లాటరీ తీస్తామన్నారు.

ఎపి సర్వే ఎంప్లాయీస్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్‌గా మౌలాలి

యాడికి : గుంతకల్లు రెవెన్యూ డివిజినల్ కార్యాలయ ప్రాంగణంలో శనివారం నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ సర్వే ఎంప్లాయీస్ అసోసియేషన్ ఎన్నికల్లో యాడికి మండలం నిట్టూరు గ్రామ సర్వేయర్ ఎస్‌పి మౌలాలిని వైస్ ప్రెసిడెంట్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు మౌలాలికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలు మండలాల సర్వేయర్లు, సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆర్డీటీకి ఎఫ్‌సిఆర్‌ఎ రెన్యువల్‌పై హర్షం

అనంతపురం కలెక్టరేట్ : ఆర్‌డిటి సంస్థకు ఎఫ్‌సిఆర్‌ఎను రెన్యువల్ కోసం కృషి చేస్తామని మంత్రి నారా లోకేష్ హామీ ఇవ్వడంతో అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. కళ్యాణదుర్గం పర్యటనకు వచ్చిన మంత్రి నారా లోకేష్ దృష్టికి ఆర్డీటీ ఎఫ్‌సిఆర్‌ఎ విషయాన్ని తీసుకెళ్లారు. ఇందుకు స్పందించిన మంత్రి లోకేష్ ఎఫ్‌సిఆర్‌ఎ రెన్యువల్‌తో పాటు సంస్థకు మరింత ప్రోత్సాహం ఇస్తామని హామీ ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు.

బీసీ వెల్ఫేర్ శాఖ ఎక్స్‌అఫిషియో సెక్రటరీకి ఘనస్వాగతం


బిసి వెల్ఫేర్ సెక్రటరీకి స్వాగతం పలుకుతున్న కలెక్టర్ ఓ.ఆనంద్

అనంతపురం కలెక్టరేట్ : రాష్ట్రస్థాయి భక్త కనసదాస 538వ జయంతోత్సవాల్లో పాల్గొనేందుకు విచ్చేసిన రాష్ట్ర బీసీ వెల్ఫేర్ శాఖ ఎక్స్‌అఫిషియో సెక్రటరీ ఎస్.సత్యనారాయణకు శనివారం నగరంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ ఓ.ఆనంద్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూల బొకే అందజేశారు.

భక్త కనకదాసకు నివాళి


కనకదాసకు నివాళులర్పిస్తున్న వైసిపి నేతలు

బుక్కరాయసముద్రం : భక్త కనకదాస జయంతిని పురస్కరించుకుని శనివారం మండల కేంద్రంలోని వైసిపి కార్యాలయంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ సాకే శైలజనాథ్, మండల అధ్యక్షులు గువ్వల శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఒకేషనల్ విద్యార్థుల పరిశ్రమల సందర్శన


పరిశ్రమలో విషయాలను తెలుసుకుంటున్న విద్యార్థులు

కళ్యాణదుర్గం రూరల్ : శెట్టూరు మండలం పరిధిలో ఉన్న ఎపి మోడల్ స్కూల్ విద్యార్థులు ఒకేషనల్ శిక్షణలో భాగంగా గ్రీన్ కో విండ్ పవర్‌ప్లాంట్‌ను శుక్రవారం సందర్శించారు. ఇందులో భాగంగా ఎలక్ట్రిసిటీ ఎలా తయారు అవుతుంది.. ఎలా ట్రాన్స్‌ఫర్ అవుతుందనే విషయాలను అక్కడి ఇంజినీర్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఒకేషనల్ అధ్యాపకులు వినోద్‌కుమార్ మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఆదేశాలతో విద్యార్థుల్లో నాలెడ్జ్‌ని పెంచేందుకు పవర్‌ప్లాంట్ సందర్శనను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నారాయణస్వామి, హిమబిందు, రేష్మ పాల్గొన్నారు.

నారా లోకేష్‌ను కలిసిన సంగా తేజస్విని


లోకేష్‌కు పుష్పాలు అందజేస్తున్న సంగా తేజస్విని

అనంతపురం : జిల్లా పర్యటనకు వచ్చిన నారా లోకేష్‌ను ఆంధ్రప్రదేశ్ తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి సంగా తేజస్విని వాల్మీకి శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించిన భక్త కనకదాసు జయంతిలో పాల్గొన్న లోకేష్‌ను కలిసి పుష్పాలు అందజేశారు.

రెవెన్యూ క్రీడోత్సవాల నిర్వహణకు ఎన్‌టిపిసి విరాళం

అనంతపురం కలెక్టరేట్ : అనంతపురం ఆర్‌డిటి స్టేడియంలో జరుగుతున్న ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ ఉద్యోగుల 7వ రాష్ట్ర స్థాయి క్రీడా, సాంస్కృతిక ఉత్సవాల నిర్వహణకు ప్రభుత్వ సంస్థకు చెందిన ఎన్‌టిపిసి ఏపీ ఎన్‌హెచ్‌ఏఎల్ ప్రతినిధులు జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్‌ను కలిసి రూ.5 లక్షల విలువైన చెక్‌ను విరాళంగా అందజేశారు. శనివారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్, ఆంధ్రప్రదేశ్ హరిత అమృత్ లిమిటెడ్ ప్రతినిధులు, ఆ సంస్థ కన్సల్‌టెంట్ జీవి.విశ్వనాథ్, ఇంజనీర్‌లు అభిజిత్, రాంబాబు తదితరులు కలెక్టర్‌ను కలిసి చెక్ అందజేశారు. నవంబర్ 7, 8, 9 తేదీల్లో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాలు విజయవంతం కావాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వారిని అభినందించారు.

గుండెపోటుతో రైతు మృతి

బుక్కరాయసముద్రం : గుండెపోటుతో రైతు మృతిచెందిన ఘటన మండలంలోని చెన్నంపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. చెన్నంపల్లి గ్రామం దళిత కాలనీకి చెందిన వి.నారాయణ స్వామి (55) గెదెలను మేపుతుండగా ఒక్కసారిగా కూప్పకూలాడు. వెంటనే కుటుంబ సభ్యులు నార్పల మండల కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు తెలిపారు. కుటుంబ పెద్దను కోల్పోవడంతో భార్య, ముగ్గురు కూతుళ్లు, కొడుకు విషాదంలో మునిగిపోయారు.